క్లుప్తంగా

పోషణ పక్షోత్సవాలు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఏసీడీపీవో జ్యోతి, సీడీపీవో భార్గవి ముఖ్య అతిథులుగా హాజరై గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించారు. అనంతరం శిశువులకు అన్న ప్రాసన, గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. సర్పంచ్ ఆసపురం దేవి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ సామెర సురేష్ పాల్గొన్నారు.

మరమ్మతులకు నిధులు

నందిపేట్ (ఆర్మూర్): కుద్వాన్‌పూర్‌లో గల ఊర చెరువు(పెద్ద చెరువు) తూము మరమ్మతుల కోసం రూ.48.90 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. శుక్రవారం ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, గ్రామస్తులకు నిధుల మంజూరు పత్రాన్ని అందజేశారు. సర్పంచ్ సాయన్న, ఎంపీటీసీ ప్రవీణ్ గౌడ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చెక్కుల అందజేత



వేల్పూర్: వాడి గ్రామంలో ముగ్గురు, పచ్చలనడ్కుడలో ఇద్దరికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం అందజేశారు. సర్పంచులు గోపు మహేశ్, ఏనుగు గంగారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఏలేటి రమేశ్, నడ్కుడ సొసైటీ ఛైర్మన్ లింబారెడ్డి, ఎంపీటీసీ నోముల గంగారెడ్డి పాల్గొన్నారు.

కోటగిరిలో..

రుద్రూర్: కోటగిరి గ్రామ పంచాయతీ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను శుక్రవారం స్థానిక సర్పంచ్ పత్తి లక్ష్మణ్ అందజేశారు. ఆర్ఐ సయ్యద్ హుస్సేన్, రైతు బంధు మండల అధ్యక్షుడు కిషోర్ బాబు, విండో చైర్మన్ కూచి సిద్దు, బీఆర్ఎస్ అధ్యక్షుడు అనిల్ కులకర్ణి ఉన్నారు.

స్టడీ మెటీరియల్..

వేల్పూర్: పచ్చలనడ్కుడ హైస్కూలు ఎస్సెస్సీ విద్యార్థులకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి వితరణ చేసిన డిజిటల్ స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. స్టడీ మెటీరియల్‌ను ఏ విధంగా వాడుకోవాలో వివరించారు. ఈ మెటీరియల్‌తో చదువుకొని ఎస్సెస్సీ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. సర్పంచ్ ఏనుగు గంగారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఏలేటి రమేశ్, సొసైటి ఛైర్మన్ లింబారెడ్డి, ఎంపీటీసీ గంగారెడ్డి, హెచ్ఎం సురేష్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్‌లో స్థానిక దాత సుంకెట గంగాధర్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ అశోక్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో దాత గంగాధర్, నాయకులు మహేష్, ముఖేష్, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాలు..

రుద్రూర్: మండలంలోని అక్బర్‌నగర్, సిద్దాపూర్ గ్రామాల్లో శుక్రవారం కంటి వెలుగు శిబిరాలను స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. గ్రామస్తులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. మండల వైద్యాధికారి ఆయేషా సిద్దికా, అక్బర్‌నగర్ ఉప సర్పంచ్ రంజిత్, సిద్దాపూర్ సర్పంచ్ లక్ష్మణ్, ఉపసర్పంచ్ మల్లనురి పద్మ, జి శ్రీలత, రాజేశ్వరి ,జ్యోతి, ఉమామహేశ్వరి వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి



బోధన్‌రూరల్(బోధన్): దివ్యాంగుల సమస్యలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షులు సుజాత సూర్యవంశీ అన్నారు. శుక్రవారం బెల్లాల్ గ్రామంలో వీహెచ్‌పీఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత సూర్యవంశీ మాట్లాడుతూ.. దివ్యాంగులకు అందించే పథకాలకు ఆన్‌లైన్ దరఖాస్తు విధానాన్ని రద్దు చేయాలన్నారు. అర్హులైన వారికి పింఛన్లు, డబుల్ బెడ్ రూం ఇళ్లు, అంత్యోదయ కార్డులు అందించాలన్నారు. దివ్యాంగుల హక్కుల సాధన కోసం జిల్లా, మండల కమిటీలు కృషి చేయాలన్నారు.

ఆలయ రాజకీయాలు మానుకోవాలని హితవు

నవీపేట: బీజేపీ నేతలు అనుసరిస్తున్న ఆలయ రాజకీయాలు మానుకోవాలని ఎంపీపీ సంగెం శ్రీనివాస్, బీఆర్ఎస్ నేతలు నర్సింగ్‌రావ్, ప్రవీణ్ , తెడ్డు పోశెట్టి, అబ్బన్నలు హితవు పలికారు. ఎల్‌కే ఫారమ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ చేసిన ఆరోపణలను ఖండించారు. ఎల్‌కే ఫారమ్ సొసైటీ వైస్ ఛైర్మన్ ప్రవీణ్ కుమార్ ఎస్సీ కాదని, క్రిస్టియన్ అని నిర్ధారించడానికి యెండలకు ఎలాంటి అధికారాలు ఉన్నాయని ప్రశ్నించారు. వీడీసీ ఛైర్మన్ సాంబశివరావ్, బీఆర్ఎస్ నేతలు సూరిబాబు, సాయికుమార్‌గౌడ్, జనార్ధన్, సాయిలు పాల్గొన్నారు.

బైపాస్‌కు మోక్షం లభించేనా?

- మూలుగుతున్న రూ.3.90 కోట్ల నిధులు
- నవీపేట శివారులో పూర్తికాని భూసేకరణ



నవీపేటలో ప్రమాదకరంగా మారిన మూలమలుపు

నవీపేట: నవీపేట శివారులో నిర్మించ తలపెట్టిన బాసర బైపాస్ రోడ్డుకు మోక్షం లభించలేదు. నిధులు సిద్ధంగా ఉన్నా భూసేకరణ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. దక్షిణ భారత దేశంలో పేరుగాంచిన నిర్మల్ జిల్లా బాసరలోని సరస్వతి ఆలయ దర్శనానికి ప్రతి నిత్యం వేల సంఖ్యలో భక్తులు బాసర రహదారి వెంబడి రాకపోకలు సాగిస్తారు. ఎడపల్లి మండలంలోని జానకంపేట నుంచి యంచ వరకు గల రహదారి కుచించుకుపోవడంతో నాలుగులేన్ల రోడ్డుకు మూడేళ్ల కిందట పనులు ప్రారంభించారు. రూ.55 కోట్ల వ్యయంతో జానకంపేట నుంచి ఫకీరాబాద్ వరకు 14 కిలో మీటర్ల మేర ఆలస్యంగానైనా పనులను పూర్తి చేశారు.

తక్కువ పారితోషికమే కారణం..

మహారాష్ట్ర వైపు వెళ్లే భారీ వాహనాలను నిజామాబాద్ కంఠేశ్వర్ బైపాస్ నుంచి గుండారం, మల్కాపూర్, మోకన్‌పల్లి, కమలాపూర్ మీదుగా నవీపేటకు అనుసంధానించాలని ప్రతిపాదనలు పంపారు. గుండారం నుంచి నవీపేట వరకు బీటీ రోడ్డు విస్తరణ పనులను కూడా పూర్తి చేశారు. నవీపేటలోని టీటీడీ కల్యాణ మండపం నుంచి అయ్యప్ప ఆలయం ముందు ఉన్న బాసర రహదారికి 600 మీటర్ల మేర ఈ రోడ్డు అనుసంధానం చేయాల్సి ఉంది. ఈ పనులకు రెండేళ్ల కిందట రోడ్డు భవనాల శాఖ రూ.3.90 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు పంపించగా నిధులు మంజూరయ్యాయి. కానీ ఆ పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ పూర్తి కాలేదు. పంటలు సాగు చేస్తున్న ఈ భూమిని ప్రభుత్వం ఇచ్చే తక్కువ పారితోషికానికి ఇచ్చేందుకు రైతులు ససేమిరా అంటున్నారు. రెవెన్యూ, రోడ్డు భవనాల శాఖ అధికారులు రైతులతో పలుమార్లు సంప్రదింపులు జరిపి విఫలమయ్యారు. దీంతో బైపాస్ పనులు ముందుకు కదలడం లేదు.

భూసేకరణ పూర్తి కాలేదు

నవీపేట శివారులో బైపాస్ నిర్మాణానికి రెండేళ్ల కిందటనే రూ.3.90 కోట్లు మంజూరయ్యాయి. సర్వేలు పూర్తి చేశాం. కానీ ఈ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూమిని అప్పగించేందుకు యజమానులు ముందుకు రావడం లేదు. సర్వేలు పూర్తి చేశాక భూసేకరణ బాధ్యతను రెవెన్యూ శాఖకు అప్పగించాం. బైపాస్ నిర్మాణానికి అవసరైన స్థలాన్ని రెవెన్యూ శాఖ అప్పగిస్తే పనులు ప్రారంభిస్తాం.

– రామ్మోహన్, ఆర్అండ్‌బీ డీఈఈ, బోధన్

ప్రమాదాలు జరుగుతున్నాయి

వృత్తి రీత్యా ప్రతి రోజు నవీపేటకు వస్తుంటాను. నవీపేట శివారులో బైపాస్ పేరిట కొద్దిమేర ఫోర్ లేన్ పనులను ఆపేశారు. బైపాస్ రోడ్డును కలుపుతామని పనులు చేయకపోవడంతో స్పీడ్‌గా వస్తున్న వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే మూల మలుపుల దగ్గర ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ప్రమాదాల నివారణకు బైపాస్ రోడ్డు పనులను ప్రారంభించాలి. పనులు పూర్తయ్యే వరకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– సాయిబాబాగౌడ్, ఫకీరాబాద్

ప్రమాదకర మూలమలుపులకు ప్రత్యామ్నాయం

నవీపేట పట్టణం మధ్య నుంచి విస్తరించుకున్న బాసర రహదారి ఫోర్‌లేన్ పనులను రెండేళ్ల కిందట పూర్తి చేశారు. నవీపేటలో రెండు చోట్ల ఉన్న మూల మలుపులు అత్యంత ప్రమాదకరంగా మారాయి. ఈ మూల మలుపుల దగ్గర పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డారు. అలాగే ఎడపల్లి మండలంలోని జానకంపేటతో పాటు నవీపేట, ధర్మారం(ఎ) గ్రామాలలో రైల్వే ట్రాక్, వాహనదారుల రాకపోకలకు ఆటంకం కలిగిస్తోంది. అలాగే విద్యుత్ సరఫరాతో రైళ్ల రాకపోకలను ఆధునీకరించారు. ఈ ప్రాంతాల దగ్గర ఎత్తైన భారీ వాహనాల రాకపోకలను నిషేధించారు. ఈ రెండు కారణాలతో జిల్లా కేంద్రం నుంచి వచ్చే భారీ వాహనాల రాకపోకలను మళ్లించాలనే లక్ష్యంతో బైపాస్‌కు ప్రతిపాదనలు చేశారు.



ఈజీఎస్ పనుల పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి నర్సయ్య

వేల్పూర్: జాన్కంపేట్, పచ్చలనడ్కుడ గ్రామాలలో ఈజీఎస్ పనులను వేల్పూర్ మండల ప్రత్యేక అధికారి రాజనర్సయ్య శుక్రవారం పరిశీలించారు. నర్సరీలలో ఏయే రకాల మొక్కలు పెంచుతున్నది తెలుసుకున్నారు. క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈజీఎస్ పనులపై రెండు గ్రామాల సర్పంచులు సొడ రమేశ్, ఏనుగు గంగారెడ్డితో మాట్లాడి తెలుసుకున్నారు. ఎంపీడీవో కమలాకర్‌రావు, ఏపీవో అశోక్, తదితరులున్నారు.

హన్మాన్ స్వాముల భిక్ష

రుద్రూర్: లింగంపల్లి శివారులోని శివాలయం వద్ద శుక్రవారం రుద్రూర్ సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో హన్మాన్ స్వాముల భిక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మల్లారం పిట్ల కృష్ణ మహరాజ్ హాజరై ప్రవచనాలు చేశారు. హన్మాన్ దీక్ష ప్రాధాన్యత గురించి వివరించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



దండిగుట్టలో పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

రెంజల్(బోధన్): దండిగుట్టలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం సర్పంచ్ ముళ్లపూడి శ్రీదేవి ప్రారంభించారు. రోడ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరైనట్లు వివరించారు. కార్యక్రమంలో బాగేపల్లి సర్పంచ్ సాయిలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బాల్కొండ మండల కేంద్రంలో..

బాల్కొండ: మండల కేంద్రంలో రూ.90 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ బూస సునీత శుక్రవారం ప్రారంభించారు. మెండోరా మండలం పోచంపాడ్‌లో రూ.5 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను కూడా సర్పంచ్ ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రైస్‌మిల్‌ను ఏర్పాటు చేయండి

రుద్రూర్: కోటగిరి సహకార సంఘం ఆధ్వర్యంలో రైస్‌మిల్‌ను ఏర్పాటు చేయాలని, ధాన్యం నిల్వ కోసం గోదాముల మరమ్మతులు చేపట్టాలని విండో మహాజన సభలో తీర్మానం చేశారు. కోటగిరి విండో మహాజన సభ శుక్రవారం చైర్మన్ కూచి సిద్దు అధ్యక్షతన జరిగింది. ఆదాయ వ్యయాలపై చర్చించారు. సంఘ అభివృద్ధికి పాలక వర్గం ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులను చైర్మన్ వివరించారు.

103వ రోజుకు 'జిల్లా' దీక్షలు



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బోధన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 103వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో న్యాయవాదులు హన్మంత్‌రావ్, పాల్దె శంకర్, శివకుమార్‌లు కూర్చున్నారు. దీక్షలు చేపట్టి 100 రోజులు దాటినా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఈ దీక్షా శిబిరాన్ని న్యాయవాదులు, వివిధ పార్టీల నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు.

శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

మాక్లూర్: వల్లభాపూర్‌లో శుక్రవారం శివాజీ విగ్రహ ఏర్పాటుకు స్థానిక బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు భూమి పూజ చేశారు. బీజేపీ ఆర్మూర్ నియోజకవర్గ నాయకుడు పొద్దుటూరి వినయ్‌రెడ్డి ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని సమకూర్చుతానని హామీ ఇవ్వటంతో గద్దె నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడు బాముని మోహన్, మహిళ సంఘం అధ్యక్షురాలు ధనలక్ష్మి, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ఎన్ఎస్ఎస్ తోడ్పాటు



ఎడపల్లిలో మాట్లాడుతున్న తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ రవీందర్ రెడ్డి

ఎడపల్లి(బోధన్): పర్యావరణ పరిరక్షణకు ఎన్ఎస్ఎస్ శిబిరాల ద్వారా పలు కార్యక్రమాలు చేపట్టవచ్చని తెలంగాణ యూనివర్సిటీ కో–ఆర్డినేటర్ రవీందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వారం రోజులుగా కొనసాగుతున్న బోధన్ మిమ్స్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ శిబిరాల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక అంశాలపై అవగాహన పెరుగుతుందన్నారు. జెడ్పీ వైస్ చైర్ పర్సన్ రజితమాట్లాడుతూ.. విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ శిబిరాల ద్వారా క్రమశిక్షణ అలవడుతుందన్నారు.

వేల్పూర్: లక్కోరలో శుక్రవారం నరేంద్ర డిగ్రీ, పీజీ కళాశాల(ఆర్మూర్) విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మూడవ రోజు బస్టాండు పరిసరాలను శుభ్రం చేశారు. ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు.

మాక్లూర్: జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి సరిత ఆధ్వర్యంలో సింగంపల్లి తండాలో సాంఘీక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థులు 7 రోజుల పాటు నిర్వహించిన శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జీపీ భవనంలో సర్పంచ్ గంగాధర్ రాథోడ్ ప్రత్యేక సమావేశం నిర్వహించి విద్యార్థులను అభినందించారు.

వరిలో తెగుళ్లు..నివారణ చర్యలు

వర్ని: వరిలో మొగి పురుగు, కాండం తొలుచు పురుగు, మెడ విరుపు తెగులు ఆశించి కంకులు తాలు గింజలుగా మారుతున్నాయని, రైతులు అప్రమత్తమై నివారణ చర్యలు చేపట్టాలని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సూచించారు. శుక్రవారం శంకోరా, చందూరు శివారులో వరి, మొక్కజొన్న పంటలను కేవీకే శాస్త్రవేత్తలు పరిశీలించారు. తెగుళ్ల నివారణకు సూచనలు, సలహాలు ఇచ్చారు. శాస్త్రవేత్తలు సురేష్, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చేనేత పరిశ్రమను ఆదుకోండి

రుద్రూర్: చేనేత పరిశ్రమను ప్రభుత్వం కాపాడాలని నేత కార్మికులు కోరారు. బోధన్ చేనేత సహకార సంఘం మహాజన సభ శుక్రవారం రుద్రూర్ బ్రాంచ్ కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు మోత్కూరి నారాయణ అధ్యక్షతన జరిగింది. నేత కార్మికులు సుప్పల నర్సింలు, సాయిలు మాట్లాడుతూ... కూలి గిట్టుబాటు కావడం లేదని, పెంచాల్సిందిగా సభ దృష్టికి తెచ్చారు.

సమాచారం..

నేడు బోధన్‌కు బిషప్ రాక

బోధన్‌టౌన్(బోధన్): సీఎస్ఐ(మెదక్) డయాసిస్ కమిషరీ బిషప్ కె.పద్మారావ్ ఆదివారం పట్టణంలోని సీఎస్ఐ చర్చికి రానున్నట్లు పాస్టర్ ముక్కల ప్రభాకర్ తెలిపారు. శక్కర్‌నగర్ పాస్టరేట్ పరిధిలోని సీఎస్ఐ సెయింట్ పాల్స్ చర్చి కన్ఫర్మేషన్ సర్వీస్ కార్యక్రమానికి హాజరుకానున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు 'ఫైలేరియా' నిర్ధారణ పరీక్షలు



ఆర్మూర్ టౌన్: పట్టణంలోని లోటస్ స్మార్ట్ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఫైలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. నిర్ధారణ పరీక్షలను డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 5 నుంచి 8 ఏళ్ల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ఫైలేరియా వ్యాధి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు చేతులు శుభ్రపరుచుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ అంబికా, వైస్ ప్రిన్సిపాల్ పల్లవీ రెడ్డి పాల్గొన్నారు.

నిందితుడిని బహిరంగంగా శిక్షించాలి



కమ్మర్‌పల్లి: మండలంలో ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని బహిరంగంగా శిక్షించాలని బీజేపీ నేత ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం చౌట్‌పల్లిలో మాట్లాడుతూ.. ఇలాంటి కేసులో నిందితుడిని బహిరంగంగా శిక్షించాలే కాని నిందితుడి పేరు బయటకు రాకుండా చేసి పోలీసులు కోర్టులో హాజరు పరిచారని అన్నారు. అనుమానస్పద వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసు వ్యవస్థ ఏం చేస్తుందని ప్రశ్నించారు.

కష్టపడి చదివితేనే ఉత్తమ జీపీఏ

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మంథని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే జీవన్ రెడ్డి విజయ స్ఫూర్తి కార్యక్రమం ద్వారా శుక్రవారం పరీక్ష ప్యాడ్లు, స్టేషనరీ సామగ్రిని అందజేశారు. స్థానిక సర్పంచ్ పుట్టింటి లింబా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ .. విద్యార్థులు పదో తరగతిలో కష్టపడి చదివి ఉత్తమ జీపీఏ సాధించాలని ఆకాంక్షించారు.

వైభవంగా రాముల వారి పట్టాభిషేకం



శక్కర్‌నగర్‌లోని రామాలయంలో రాముల వారికి పట్టాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



పడగల్‌లో సీతారాముల విగ్రహాలకు చక్రస్నానం

బోధన్‌టౌన్(బోధన్): శక్కర్‌నగర్ కాలనీలోని రామాలయంలో రాముడి పట్టాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. వేద మంత్రాలతో రాముల వారి పట్టాభిషేక కార్యక్రమాన్ని ప్రవీణ్ మహారాజ్ జరిపించారు. ముందుగా సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మోస్రాలో ..

రుద్రూర్: మోస్రా మండల కేంద్రంలోని సీతారామ చంద్రస్వామి ఆలయంలో రాములవారి పట్టాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరిపారు. సాయంత్రం శోభాయాత్ర నిర్వహించారు.

దేవతామూర్తులకు చక్రస్నానం

వేల్పూర్: శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం పడగల్‌లో దేవతామూర్తులకు స్థానిక ఊర చెరువులో చక్రస్నానం నిర్వహించారు. కార్యక్రమంలో వీడీసీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఆర్మూర్: పట్టణంలోని రామాలయంలో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఉదయం రామాలయంలో ప్రత్యేక పూజలు చేసినంతరం శ్రీరాములవారి పట్టాభిషేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఎడపల్లిలో సీతారాముల కల్యాణం

ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలోని శ్రీరామ మఠం ఆధ్వర్యంలో శ్రీరామ నవమి పండగ పురస్కరించుకొని శుక్రవారం సీతారాముల కళ్యాణం మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాముల కల్యాణానికి గ్రామస్తుల ఆధ్వర్యంలో పట్టువస్త్రాలను అందజేశారు. ఎడపల్లిలో శ్రీరామ మఠం ఉన్నందున గురువారం జన్మదినం నిర్వహించారు శుక్రవారం ఉదయం సీతారాముల కల్యాణం జరిపించారు.

అర్ధంతరంగా ముగిసిన మహాజన సభ



పొతంగల్ విండో సభలో కార్యదర్శిని నిలదీస్తున్న సభ్యుడు

- సంఘం పనితీరుపై సభ్యుల అసంతృప్తి
- 13కు పొతంగల్ మహాజన సభ వాయిదా

రుద్రూర్: పొతంగల్ విశాల సహకార సంఘం కార్యదర్శి పనితీరుపై సంఘ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పొతంగల్ విండో 84వ మహాజన సభ శుక్రవారం సంఘం అధ్యక్షుడు శాంతీశ్వర్ పటేల్ అధ్యక్షతన జరిగింది. సభ్యుల ప్రశ్నలకు సంఘ కార్యదర్శి సరైన సమాధానాలు చెప్పకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. అమ్మకాలకు సంబంధించిన పూర్తి వివరాలు నివేదికలో ఎందుకు పొందుపరచలేదని నిలదీశారు. ఎవరికి పట్టనట్టుగా వ్యవహరిస్తే సంఘాన్ని నమ్ముకున్న సభ్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. సభను అర్ధంతరంగా వాయిదా వేసి సమగ్ర నివేదికతో ఈ నెల 13న సభ ఏర్పాటు చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు.

బోధన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నందకుమార్



ఫలితాలను ప్రకటిస్తున్న ఎన్నికల అధికారి

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది జె. నందకుమార్ నియమితులయ్యారు. బోధన్ కోర్టులోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి శ్రీనివాస్ రావ్ ప్రకటించారు. శుక్రవారం బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎన్నికకు పోలింగ్ నిర్వహించారు. మొత్తం 91 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్షులుగా పోటీ చేసిన సీనియర్ న్యాయవాది జె. నందకుమార్‌కు 57 ఓట్లు రాగా, ఎం.గంగారెడ్డికి 34 ఓట్లు వచ్చాయి. ప్రధాన కార్యదర్శిగా పోటీ చేసిన ఈశ్వర్‌కు 48 ఓట్లు రాగా కోటేశ్వర్‌రావ్‌కు 43 ఓట్లు వచ్చాయి. బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. ఉపాధ్యక్షులుగా రమాకాంత్ షిండే, వాజిద్ హుస్సేన్, కోశాధికారిగా పల్నాటి సమ్మయ్య, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా ఆరిఫోద్దీన్, లైబ్రరీ సెక్రటరీగా మాధవి ఎన్నికయ్యారు.

కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించాలి



దూపల్లి సభలో మాట్లాడుతున్న చైర్మన్ భూంరెడ్డి

రెంజల్(బోధన్): ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించాలని విండో మహాజన సభల్లో సంఘ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. వరి పంట నూర్పిడిలు ప్రారంభమయ్యాయని విండోల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే కేంద్రాలను సీజన్ ప్రారంభ దశలోనే అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. మండలంలోని దూపల్లి, నీలా విండో మహాజన సభలు శుక్రవారం చైర్మన్లు భూంరెడ్డి, ఇమాంబేగ్‌ల అధ్యక్షతన నిర్వహించారు. ధాన్యం కొనుగోలు సమయంలో కార్యదర్శులు అందుబాటులో ఉండి రైతులకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని రైతులు సభ దృష్టికి తీసుకొచ్చారు. దూపల్లి సర్పంచ్ సాయరెడ్డి, కార్యదర్శులు జీవన్ రెడ్డి, రాందాస్ పాల్గొన్నారు.

'ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం'



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయి

బోధన్‌రూరల్(బోధన్): బోధన్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ(ఏఎంసీ)ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని చైర్మన్ వీఆర్ దేశాయి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఏఎంసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్షాల నాయకులు రాజకీయాల్లో హుందాగా వ్యవహరించాలన్నారు. సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా పోస్టులు పెట్టడం సరికాదన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ప్రభుత్వ భూమి కబ్జా విషయంలో మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి పేరు వచ్చిందని, ఈ విషయంపై కాంగ్రెస్ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. పసుపు బోర్డు తేవడంలో విఫలమైన ఎంపీ అర్వింద్ ప్రజలకు క్షమాపణ చెప్పి వెంటనే రాజీనామా చేయాలన్నారు. బోధన్ పట్టణంలో శివాజీ విగ్రహ ఏర్పాటు వివాదంలో పలువురిపై నమోదైన కేసులను తొలగించేందుకు ఎమ్మెల్యే షకీల్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని వివరించారు. నాయకులు లింగారెడ్డి, అశోక్ రెడ్డి, శంకర్ గౌడ్ పాల్గొన్నారు.